
# భారీ భవనం..రోబోలతో చకచకా పక్కకు!

- చైనాలో 7,500 మెట్రిక్ టన్నుల భవనాన్ని జరిపే పనుల్లో 432 చిన్న మర మనుషులు
- రోజుకు 10 మీటర్ల పని పూర్తి



బీజింగ్: చైనాలోని షాంఘై, ఝూంగియాన్ ప్రాంతంలో హుయాయాన్లీ భవన సముదాయాన్ని రోజుకు 10 మీటర్ల చొప్పున పక్కకు జరుపుతున్నారు. రోబోలు, ఏఐ (కృత్రిమ మేధ) సహకారంతో, మానవ కార్మికుల అవసరం లేకుండా ఈ పని జరుగుతుండటం విశేషం. 1920-1930 మధ్య కాలంలో నిర్మితమైన ఈ భవన సముదాయం బరువు 7,500 మెట్రిక్ టన్నులు. ఇది 4,030 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. దీని కింద 53 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో సాంస్కృతిక, వాణిజ్య ప్రాంతాలు, పార్కింగ్ కేంద్రాలను నిర్మించడం కోసం దీనిని పక్కకు జరుపుతున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయిన తర్వాత హుయాయాన్లీ భవన సముదాయాన్ని తిరిగి యథాస్థానానికి తీసుకొస్తారు.

**డీప్ లెర్నింగ్ ఏఐ సాయంతో ప్రమాదాల నివారణ**

హుయాయాన్లీ భవన సముదాయాన్ని పాశ్చాత్య, చైనీస్ వాస్తు పద్ధతుల్లో నిర్మించారు. దీనిని 432 నడిచే చిన్న రోబోలు నెమ్మదిగా పైకి ఎత్తి, అత్యంత నెమ్మదిగా పక్కకు జరుపుతాయి. ఈ ప్రాంతంలోని భవనాల మధ్య ఖాళీ స్థలాలు, దారులు ఇరుకుగా ఉంటాయి. పాత కాలంనాటి భవనాలు దగ్గర దగ్గరగా ఉంటాయి. అందుకే ఈ ప్రాజెక్టు కోసం డ్రిల్లింగ్, స్పెషల్ ఎర్త్ మూవింగ్ రోబోలను ఉపయోగిస్తున్నారు. ఇవి 1.2 మీటర్ల ఇరుకైన ప్రదేశంలో కూడా పని చేయగలవు. ఈ స్థలంలో మట్టి, రాళ్ల వంటి పదార్థాలను గుర్తించడానికి డీప్ లెర్నింగ్ ఏఐ సాయపడుతున్నది. భవనాలు, స్థలం 3డీ నమూనాలను అత్యంత వివరంగా రూపొందించడానికి ఇంజినీర్లు బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, పాయింట్ క్లౌడ్ స్కానింగ్‌లను ఉపయోగించారు. ఒకదానికొకటి ఢీ కొట్టే ముప్పును గుర్తించేందుకు, మట్టిని రవాణా చేయడానికి మలుపులు గల మార్గాలను డిజైన్ చేయడానికి ఈ మోడల్స్ ఉపయోగపడుతున్నాయి.

# చినాబ్ 'అద్భుతం' తెలుగు మహిళ కృషే

- వంతెన డిజైనింగ్‌లో ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీ లత కీలక పాత్ర
- ఆమె బృందం 17 ఏండ్ల శ్రమతో భారత్ వందేండ్ల కల సాకారం



బెంగళూరు, జూన్ 7: జమ్ము-శ్రీనగర్‌ను అనుసంధానం చేసేందుకు ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సింగిల్ ఆర్చ్ రైల్వే వంతెనను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈఫిల్ టవర్ కన్నా 35 మీటర్ల ఎత్తయిన ఇంజినీరింగ్ అద్భుతంగా వర్ణించే ఈ చినాబ్ రైలు వంతెనను డిజైన్ చేసింది ఓ తెలుగు మహిళ. ఈ వంతెన నిర్మాణం కోసం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని(ఐఐఎస్‌సీ) సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో జియో టెక్నికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి మాధవీలత, ఆమె బృందం 17 ఏండ్ల సమయాన్ని జాతి సేవకు అంకితం చేశారు. ఇండియన్ జియో టెక్నికల్ జర్నల్ మే 28న ప్రచురించిన మహిళల ప్రత్యేక సంచికలో మాధవీ లత ఓ వ్యాసాన్ని రాశారు. భారత్ వందేండ్ల కల అయిన ఈ వంతెన నిర్మాణం, డిజైనింగ్‌లో తాము ఎదుర్కొన్న సవాళ్లను అందులో వివరించారు.

**జియో టెక్నికల్ ఇంజినీరింగ్ పరిశోధనలో మేటి**

వరంగల్ ఎన్ఐటీలో ఎంటెక్, ఐఐటీ-మద్రాసులో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన డాక్టర్ మాధవీ లత 2004లో ఐఐఎస్‌సీలో చేరడానికి ముందు ఐఐటీ-గువాహటిలో బోధించారు. ఇండియన్ జియో టెక్నికల్ సొసైటీ నుంచి జియో టెక్నికల్ ఇంజినీరింగ్ అవార్డును అందుకున్న తొలి ఉత్తమ పరిశోధకురాలు. మాధవీ లతే. ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ ఎస్‌కే చటర్జీ ఔట్‌స్టాండింగ్ రీసెర్చర్ అవార్డును, కర్ణాటక బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి మహిళా కార్యసాధకురాలు అవార్డును అందుకున్నారు. టీమ్ ఆఫ్ ఇండియాలోని 75 మంది మహిళల్లో ఆమె అగ్రస్థానంలో నిలిచారు.

**టాయిలెట్ కోసం పోరాటం**

డాక్టర్ మాధవీ లత ఐఐఎస్‌సీలో చేరినపుడు ఆమే తొలి మహిళా ఫాకల్టీ సభ్యురాలు. అయితే ఆమె జియో టెక్నికల్ ఇంజినీరింగ్ భవనంలో మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ నిర్మాణానికి ఆమె గట్టి పోరాటం చేసి సాధించారు.

## 6 వేలకు చేరువలో కొవిడ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కొవిడ్-19 కేసుల సంఖ్య 5,755కు చేరింది. కేంద్ర ఆరోగ్య శాఖ వెబ్‌సైట్ ప్రకారం, శుక్రవారం నుంచి శనివారం వరకు కొత్తగా 391 కేసులు నమోదయ్యాయి. కేరళలో అత్యధికంగా 1,806 కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో గుజరాత్ (717), ఢిల్లీ (665), ప.బెంగాల్ (622) ఉన్నాయి. ప్రస్తుతం కరోనా వైరస్ తీవ్రత అత్యంత స్వల్పంగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.




దేశంలో మొత్తం యాక్టివ్ కరోనా కేసులు **5,755**

కొత్తగా నమోదైన కేసులు **391**

ఈ ఏడాది ఇప్పటివరకు మరణాలు-**59**

తాజాగా నమోదైన మరణాలు-**4**

# మహారాష్ట్ర ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్

- అదే బీహార్ ఎలక్షన్లలోనూ రిపీట్ అవుతుంది
- బీజేపీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు




న్యూఢిల్లీ, జూన్ 7: మోసపూరిత విధానాలను అవలంబించడం ద్వారానే బీజేపీ ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని, ఆ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని మోసం చేయడానికి ఒక బ్లూప్రింట్ లాంటివని ఆయన విమర్శించారు. ఈ మ్యాచ్ ఫిక్సింగ్ త్వరలోనే బీహార్ ఎన్నికల్లో, ఆ తర్వాత బీజేపీ ఓడిపోయే అన్ని ప్రాంతాల్లో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ఆంగ్ల పత్రికలో రాసిన ఆర్టికల్‌లో మహారాష్ట్రలో రిగ్గింగ్ ప్రక్రియ జరిగిన ఐదు దశలను వివరించారు. మొదటి దశ: ఎన్నికల కమిషన్ నియామకం కోసం ప్యానెల్‌ను రిగ్ చేయండి. 2వ దశ: ఓటరు లిస్టులో నకిలీ ఓటర్లను చేర్చండి. 3వ దశ: కృత్రిమంగా ఓటర్ల సంఖ్యను పెంచండి. 4వ దశ: కచ్చితంగా బీజేపీ విజయానికి అవసరమైన చోట బోగస్ ఓటింగ్‌ను లక్ష్యంగా చేసుకోండి. 5వ దశ: సాక్ష్యాలన్నీ మాయం చేయండి. ఈ విధానాలను పాటించే బీజేపీ ఎన్నికల్లో గెలిచిందని ఆయన ఆరోపించారు.

**పూర్తిగా అర్థ రహితం: ఈసీ**

రాహుల్ చేసిన ఆరోపణలు పూర్తిగా అర్థరహితమైనవని ఎన్నికల సంఘం పేర్కొంది. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కానీ, ఆ పార్టీ నియమించిన పోలింగ్ ఏజెంట్లు కానీ ఎలాంటి తీవ్ర ఆరోపణలు చేయని విషయాన్ని ఈసీ ప్రస్తావించింది.

**నకిలీ కథనాల తయారీకి బ్లూప్రింట్**

రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు నకిలీ కథనాలను తయారు చేయడానికి ఒక బ్లూప్రింట్ అని, వరుసగా ఎన్నికల్లో ఓడిపోతున్నామన్న విచారం, నిరాశ కారణంగా ఆయన ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. బీహార్‌లో పరాజయం తప్పదని తెలిసే రాహుల్ ఈ అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు.

# డీలిమిటేషన్ వెనుక రహస్య ఎజెండా

- జన గణన ఆలస్యం వెనుక కేంద్రం దుష్ట పన్నాగం
- జనాభా తగ్గుదలతో దక్షిణాది శిక్షకు గురి కానుంది
- తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత స్టాలిన్ ఆగ్రహం



చెన్నై, జూన్ 7: జాతీయ జనాభా లెక్కల సేకరణను(సెన్సస్) బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తూ రహస్య అజెండాతో నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) ప్రక్రియను చేపడుతోందని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆరోపించారు. 'జన గణన జాప్యం ప్రమాదం కాదు, డీలిమిటేషన్ ప్రక్రియ యాదృచ్ఛికం కాదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రమాదం మన గడప దాకా వచ్చిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ జన గణనను, తదనంతరం డీలిమిటేషన్ ప్రక్రియను అమలు చేయడం వెనుక కేంద్రంలోని మోదీ ప్రభుత్వ దుష్ట కుట్ర దాగి ఉందని సోషల్ మీడియా పోస్టులో ఆయన ఆరోపించారు. అభివృద్ధి చెందిన రాష్ట్రాలు.. ప్రత్యేకంగా హిందీయేతర భాషలను మాట్లాడే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణ విధానాలను పాటించినందుకు ఇప్పుడు శిక్షకు గురి కానున్నాయని ఆయన తెలిపారు. ఏండ్ల తరబడి జనాభా నియంత్రణను ఏమాత్రం పట్టించుకోని రాష్ట్రాలు ఇప్పుడు పార్లమెంట్‌లో అదనపు సీట్లను బహుమతిగా పొందనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది ఫెడరల్ వ్యవస్థను దెబ్బ తీయడమేనని, అభివృద్ధి సాధించిన రాష్ట్రాలను విస్మరించడమేనని ఆయన తెలిపారు. ఈ దుష్ట కుట్ర గురించి తాను ఇదివరకే హెచ్చరించానని, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిదంబరం కూడా ఇదే విషయాన్ని వివరించారని ఆయన పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉండి దక్షిణాది ప్రాతినిధ్యాన్ని రక్షించుకునేందుకు వ్యూహాలు రూపొందించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని స్టాలిన్ పిలుపునిచ్చారు. 2027లో చేపట్టనున్న జనాభా లెక్కల సేకరణ 1971 జన గణన స్థానాన్ని భర్తీ చేసి తదుపరి నియోజకవర్గాల పునర్విభజనకు ఆధారం కానున్నదని ఆయన తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలను పణంగా పెట్టి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని తనకు అనుకూలంగా పునర్ వ్యవస్థీకరించుకోవడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇది అవకాశంగా మారనున్నదని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు.



## బలవంతంగా రుద్దొద్దు..నేర్చుకుంటాం

**హిందీ భాషపై కమల్ హాసన్ వ్యాఖ్య**

న్యూఢిల్లీ, జూన్ 7: తమిళనాడులో హిందీని బలవంతంగా రుద్దడాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న క్రమంలో హిందీ భాష గురించి కమల్ హాసన్ వివరణ ఇచ్చారు. దక్షిణాదిపై హిందీ భాషను బలవంతంగా రుద్దడం అనే వివాదంపై కమల్ హాసన్ వైఖరి ఏమిటి? అన్న మీడియా ప్రశ్నకు 'నేను పంజాబ్‌కు అండగా నిలుస్తా, కర్ణాటకకు మద్దతు ఇస్తా, ఆంధ్రాకు మద్దతు ఇస్తా' అని ఆయన సమాధానం ఇచ్చారు. 'భాషను బలవంతంగా రుద్దకండి.. మేము నేర్చుకుంటాం' అని ఆయన స్పష్టం చేశారు. 'ఎందుకంటే అంతిమంగా ఇది విద్య. మనం విద్య నేర్చుకోవడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకోవాలి. ఆ మార్గంలో అడ్డంకులు సృష్టించొద్దు' అని ఆయన అన్నారు. ఒక నిర్దిష్ట భాషను బలవంతంగా రుద్దడం వల్ల అభ్యాసన ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

## పైలట్ డ్యూటీ పూర్తి.. డిప్యూటీ సీఎం నిరీక్షణ

- చివరకు గంట ఆలస్యంగా బయలుదేరిన విమానం
- మహారాష్ట్రలో కిడ్నీ రోగి చికిత్సకు కలిసొచ్చిన ఘటన!

ముంబై : మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు శుక్రవారం విమానం పైలట్ రూపంలో ఇబ్బంది ఎదురైంది. అయితే ఇది కాస్త అత్యవసరంగా మూత్రపిండాల చికిత్స చేయించుకోవాల్సిన మహిళకు వరంగా మారింది! శుక్రవారం జలగావ్‌లో ప్రభుత్వ కార్యక్రమం ముగించుకొని, విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, షిండే వ్యక్తిగత విమానం పైలట్ విమానాన్ని నడిపేందుకు తిరస్కరించారు. తన విధి నిర్వహణ సమయం ముగిసిందని, విమానాన్ని నడపాలంటే మరోసారి అనుమతి పొందాల్సి ఉంటుందని చెప్పారు.డాక్టర్ అనుమతి, ఎయిర్‌లైన్స్ అనుమతులు వచ్చిన తర్వాత ఎట్టకేలకు పైలట్ విమానాన్ని నడిపేందుకు అంగీకరించారు. ఇదంతా 45 నిమిషాలపాటు జరిగింది. అదే సమయంలో శీతల్ పాటిల్ అనే మహిళ అత్యవసరంగా మూత్రపిండాల చికిత్స కోసం ముంబైకి విమానంలో వెళ్లాల్సి ఉంది. కానీ వారు జలగావ్ విమానాశ్రయానికి చేరుకునేసరికి ఆ విమానం వెళ్లిపోయింది. మంత్రి గిరీశ్ మహాజన్‌కు ఈ విషయం తెలిసింది. షిండే అనుమతించడంతో ఆయన వెళ్లే విమానంలో శీతల్, ఆమె భర్త ముంబైకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు.



## అక్రమ వలసదారులపై దాడులు

- అట్టుడికిన లాస్ ఏంజెలెస్
- టియర్ గ్యాస్ ప్రయోగం, 44 మంది అరెస్ట్

లాస్ ఏంజెలెస్ : తమ దేశంలో తిష్ట వేసిన అక్రమ వలసదారులను ఎలాగైనా దేశం నుంచి బహిష్కరించాలని కృత నిశ్చయంతో ఉన్న ట్రంప్ ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. లాస్ ఏంజెలెస్‌లో అక్రమ వలసదారులపై ఫెడరల్ అధికారులు జరిపిన ఆకస్మిక దాడులు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం నగరమంతా నిరసనలతో హోరెత్తింది. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు చేటు చేసుకోవడంతో వారిని చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్, పెప్పర్ స్ప్రే, ఫ్లాష్ బ్యాంగ్ గ్రనేడ్‌లను ప్రయోగించారు. నగరంలోని ఫ్యాషన్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఒక వస్త్ర వ్యాపారిపై శుక్రవారం మధ్యాహ్నం ఫెడరల్ అధికారులు ఆకస్మిక దాడి చేసి 44 మంది ఉద్యోగులను నిర్బంధించారు. ఈ వార్త నగరమంతా వ్యాపించడంతో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగారు.

# ఐసీయూలో మహిళపై లైంగిక దాడి

**రాజస్థాన్‌లోని ఓ వైద్య కళాశాలలో ఘటన ▪ మత్తు మందిచ్చి దవాఖాన ఉద్యోగి ఘాతుకం**



జైపూర్, జూన్ 7: బీజేపీ పాలిత రాజస్థాన్‌లోని అల్వార్‌లో గల ఈఎస్ఐసీ వైద్య కళాశాలకు చెందిన ఐసీయూ వార్డులో ఓ 32 ఏండ్ల మహిళపై దవాఖాన నర్సింగ్ సిబ్బందిలో ఒకడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. జూన్ 4వ తేదీ రాత్రి జరిగిన ఈ దారుణంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితుడు బాధిత మహిళకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి రేప్‌నకు పాల్పడినట్టు తెలిసింది. లైంగిక దాడి జరిగిన తర్వాత బాధితురాలు తన భర్త కోసం కలవరిస్తుండగా వెంటనే సిబ్బంది ఆయనను లోపలకు పిలిపించారు. అయితే పూర్తి మత్తులో ఉన్న ఆమె ఏమీ చెప్పలేక నిద్రలోకి జారుకుంది. ఉదయం స్పృహలోకి వచ్చిన తర్వాత తనకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. వారు వెంటనే దవాఖాన పాలనాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వారు ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారు. అధికారుల సమక్షంలో నిందితుడు తమను క్షమాపణలు కోరినట్లు బాధితురాలి భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి భర్త అదనపు జిల్లా మెజిస్ట్రేట్ దృష్టికి మొత్తం వ్యవహారం తీసుకువెళ్లడంతో బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ని సమీక్షించిన పోలీసులు నిందితుడి అరెస్టు కోసం చర్యలు చేపట్టారు.




**కుక్క నోట్లో మృత శిశువు**

బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఓ దారుణం చోటుచేసుకుంది. ఇండోర్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలో ఓ నవజాత మృత శిశువును వీధి కుక్క నోటితో కరుచుకుని తీసుకెళుతుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు అడ్డుపడడంతో మృత శిశువును వదిలిపెట్టి కుక్క పారిపోయింది. దవాఖానలోని టాయిలెట్ వద్ద శనివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఈ ఘటన పూర్వాపరాలను వెలికితీస్తున్నారు. శనివారం ఓ 17 ఏండ్ల బాలిక టాయిలెట్‌కు వెళ్లడం సీసీటీవీ ఫుటేజీలో కనిపించినట్లు పోలీసులు చెప్పారు. కడుపునొప్పితో దవాఖానలో చేరిన ఆ బాలిక టాయిలెట్‌లో ప్రసవించి ఉంటుందని అనుమానిస్తున్నట్లు దవాఖాన ఇన్‌చార్జ్ డాక్టర్ వర్మ తెలిపారు.

# తదుపరి లక్ష్యం.. హిడ్మా

**ఆపరేషన్ 'బ్లాక్ ఫారెస్ట్'లో వేలాది బలగాల మోహరింపు**



హిడ్మా తాజా ఫొటో

కొత్తగూడెం ప్రగతి మైదాన్: మావోయిస్టుల అంతానికి పంతం పట్టిన కేంద్రం ఆ దిశగా అడుగులు కాదు.. ఏకంగా పరుగులే పెడుతున్నది. దీంతో వరుస ఎన్‌కౌంటర్లతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మాస్టర్ మైండ్ హిడ్మా కొరకరాని కొయ్యగా మారిన నేపథ్యంలో పీఎల్‌జీఏ చీఫ్‌ని తుదముట్టించడమే లక్ష్యంగా ఆపరేషన్ 'బ్లాక్ ఫారెస్ట్' పురుడుపోసుకుంది. ఈ క్రమంలోనే కేంద్ర కమిటీ సభ్యుడు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) చీఫ్ మడివి హిడ్మాకు సంబంధించిన తాజా చిత్రం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఇప్పటివరకు ఎవరికీ చిక్కని హిడ్మా చిత్రం వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. హిడ్మా కోసం వేల సంఖ్యలో ప్రత్యేక బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి.

**పెద్ద తలలే టార్గెట్?**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా మావోయిస్టు పార్టీ నిర్మూలనకు ఇచ్చిన టార్గెట్ మేరకు భద్రతా దళాలు తమ వేగాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా నేషనల్ పార్క్ అడవులను వేదికగా చేసుకుని వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఇప్పటివరకు 35 మంది మావోయిస్టులు బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో నేలకొరిగారు. దీనిని పరిశీలిస్తే.. కేవలం మావోయిస్టు పార్టీకి చెందిన పెద్ద తలలే లక్ష్యంగా భద్రతా దళాలు తమ 'ఆపరేషన్స్' పంథాను మారుస్తున్నారు.

**ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. నేషనల్ పార్కు ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్ మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు బీజాపూర్ జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఐదుగురి మృతదేహాలతో పాటు రెండు ఏకే-47 గన్‌లు, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## సోనియా గాంధీకి స్వల్ప అస్వస్థత

**దవాఖానకు తరలింపు**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ జాతీయ అధ్యక్షురాలు సోనియా గాంధీ శనివారం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆమెను సిమ్లాలోని ఇందిరా గాంధీ వైద్య కళాశాల దవాఖానలో చేర్పించారు. ఆమెకు ఎంఆర్ఐ పరీక్షలు చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యులు ఆమెను పర్యవేక్షిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖు మీడియా ప్రధాన సలహాదారు నరేశ్ చౌహాన్ ఈ వివరాలను మీడియాకు తెలిపారు. ఆమె సిమ్లాలో ఉండగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తున్నది.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో రన్ వే ఆధునీకరణ

**ఈ నెల 15 నుంచి రోజూ 100 సర్వీసుల రద్దు**

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 100 విమానాలను రద్దు చేయబోతున్నారు. ఈ నెల 15 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. ఆధునికీకరణ పనుల కోసం రన్ వే 28/10ని మూసివేస్తుండటంతో ఈ విమానాలను రద్దు చేస్తున్నారు. ఈ విమానాశ్రయంలోని రన్ వేలలో మూడింటిపై రోజుకు 1,400 విమానాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రన్‌వేను ఆధునికీకరించేందుకు ఏప్రిల్‌లో ప్రయత్నాలు జరిగాయి. కానీ అకస్మాత్తుగా వాయిదా వేశారు. రద్దయ్యే విమానాలన్నీ దేశీయ సర్వీసులకు చెందినవేనని తెలుస్తున్నది.

## నకిలీ సర్టిఫికెట్లతో మోసం

# 50కి పైగా గుండె ఆపరేషన్లు

- వేరే వైద్యుడి రిజిస్ట్రేషన్ నెంబర్‌తో కార్డియాలజిస్ట్‌గా చలామణి
- 8 నెలల తర్వాత అర్హతలేని డాక్టర్ గుట్టు రట్టు



ఫరీదాబాద్: దేశంలో నకిలీ వైద్యుల ఆగడాలు మితిమీరుతున్నాయని చెప్పేందుకు ఇదో ఉదాహరణ. ఎంబీబీఎస్ పట్టా పుచ్చుకున్న వైద్యుడు కార్డియాలజిస్టుగా అవతారమెత్తడమే కాకుండా 8 నెలల్లో ఏకంగా 50కిపైగా గుండె శస్త్ర చికిత్సలు చేశాడు. విషయం ఇప్పుడు వెలుగులోకి రావడంతో శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులు తమకు ఏమవుతుందోనని వణికిపోతున్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో జరిగిన ఈ ఘటన సంచలనమైంది. నిందితుడు పంకజ్ మోహన్ శర్మ బాద్షాఖాన్ సివిల్ దవాఖానాలోని హార్ట్‌కేర్ సెంటర్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. అతడు కార్డియాలజిస్ట్ కానప్పటికీ రోగులకు సర్జరీలు చేసి వారి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం మొదలు పెట్టాడు. సంజయ్‌గుప్తా అనే లాయర్, సామాజిక కార్యకర్త ఫిర్యాదుపై పోలీసులు పంకజ్‌పై నిఘా పెట్టారు. మోహన్ అనే వైద్యుడి రిజిస్ట్రేషన్ నంబరైన 2456 చూపించి, నకిలీ ధ్రువీకరణ పత్రాలతో నిందితుడు గుండె శస్త్ర చికిత్స నిపుణుడిగా మెడిటెరినా హాస్పిటల్‌లో నిరుడు జూలైలో విధుల్లో చేరినట్టు గుర్తించారు. నిందితుడు తాను ప్రిస్క్రిప్షన్ రాసే చీటీల పైనా ఎండీకి సమానమైన 'డీఎన్‌బీ' (కార్డియాలజీ) చేసినట్టు రాసుకున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడికి ఐఎంఏ నోటీస్ పంపింది. వైద్య డిగ్రీ సమర్పించాలని అతడు పనిచేసే దవాఖాన యాజమాన్యం అతడిని అడగడంతో నిందితుడు ఫిబ్రవరి నుంచి విధులకు హాజరు కాలేదు.

# ఆపరేషన్ సిందూర్ స్టేజ్ డ్రామా!

- దేశభక్తి సెంటిమెంట్‌తో ప్రధాని మోదీ మోసం
- తృణమూల్ ఎమ్మెల్యే చక్రవర్తి వివాదాస్పద వ్యాఖ్యలు




నరేంద్రనాథ్

న్యూఢిల్లీ, జూన్ 7: ఆపరేషన్ సిందూర్ స్టేజ్ డ్రామా అని, దేశభక్తి సెంటిమెంట్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను మోసం చేస్తున్నారని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ఎమ్మెల్యే నరేంద్రనాథ్ చక్రవర్తి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆపరేషన్ సిందూర్ ఎపిసోడ్ మొత్తం చూస్తుంటే ఓ స్టేజ్ నాటకంలా కనిపిస్తున్నదని అన్నారు. దేశభక్తి కలిగిన ప్రజలు, మహిళల భావోద్వేగాలతో మోదీ ఆడుకుంటున్నారని విమర్శించారు. ఈ వీడియో వైరల్ కావడంతో నరేంద్ర నాథ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. వివాదంపై స్పందించిన నరేంద్రనాథ్ తనకు భద్రతా బలగాలపై గౌరవం ఉందని, కొందరు రాజకీయ దురుద్దేశంతో తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. మరోవైపు ఈ వ్యవహారంపై బీజేపీ నేతలు తీవ్రంగా స్పందించారు. దేశ వ్యతిరేక శక్తులతో నరేంద్రనాథ్ చక్రవర్తికి ఉన్న లింకులపై ఎన్ఐఏ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

**పెద్ద దేశం భయంతో సైన్యాన్ని మోదీ ఆపేశారు : టీఎంసీ మంత్రి**

పశ్చిమ బెంగాల్ మంత్రి, టీఎంసీ నేత ఫిర్హాద్ హకీం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ పెద్ద దేశం భయంతో 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌పై దాడి చేయకుండా సైన్యాన్ని ప్రధాని మోదీ ఆపేశారని ఆరోపించారు. ప్రధాని ఒక పిరికి వ్యక్తిలాగా వ్యవహరించారని చెప్పారు. తాను గొప్ప పని చేశానని, 'ఆపరేషన్ సిందూర్' ఘనత తనదేనని మోదీ ఎలా చెప్పుకోగలరని ఆయన ప్రశ్నించారు. దీనిపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ స్పందిస్తూ, ఫిర్హాద్ హకీం ఓ పాకిస్థానీ నేత మాదిరిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.




## రోడ్డు మధ్యలో హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**పైలట్‌కు స్వల్ప గాయాలు**

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని గుప్తకాశిలో రోడ్డు మధ్యలో ఓ ప్రైవేటు హెలికాప్టర్ అత్యవసరంగా దిగింది. శనివారం మధ్యాహ్నం 12.52 గంటలకు జరిగిన ఈ సంఘటనలో హెలికాప్టర్ తోక కింద ఓ కారు నలిగిపోయింది. ఈ ఘటనలో పైలట్ కెప్టెన్ ఆర్‌పీఎస్ సోధిని దవాఖానకు తరలించారు. జిల్లా పర్యాటకాభివృద్ధి శాఖ అధికారి రాహుల్ చౌబే మాట్లాడుతూ.. బడసు బేస్ నుంచి బయల్దేరిన వెంటనే ఈ హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం ఏర్పడినట్లు పైలట్ గుర్తించి, వెంటనే రోడ్డుపై దించేశారని చెప్పారు. కేదార్‌నాథ్ ధామ్‌కు వెళ్తుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. పైలట్ అప్రమత్తత వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు చెప్పారు. నెల రోజుల వ్యవధిలో హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ జరగడం ఇది నాలుగోసారి.

## 400 డ్రోన్లతో ప్రతీకారం

**ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో ఆరుగురి మృతి**

కీవ్:ఉక్రెయిన్‌లోని వివిధ నగరాలపై రష్యా క్షిపణి, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఉక్రెయిన్ చేపట్టిన 'ఆపరేషన్ స్పైడర్‌వెబ్'కు ప్రతీకారంగా శుక్రవారం రాత్రి ఉక్రెయిన్‌లోని వివిధ ప్రాంతాలను, నగరాలను రష్యా లక్ష్యంగా చేసుకుంది. రష్యా సేనలు 400కు పైగా డ్రోన్లు, 40కి పైగా క్షిపణులను ప్రయోగించాయని, దాడుల్లో ఆరుగురు మరణించారని, మరో 80 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికార వర్గాలు తెలిపాయి. 87 డ్రోన్, 7 మిస్సైల్ దాడుల్ని అడ్డుకున్నామని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ తెలిపింది. డోనెస్క్, డ్నైప్రోపెట్రోవిస్క్, ఒడెస్సా, టెర్నోపిల్ తదితర నగరాలను రష్యా టార్గెట్ చేసిందని వెల్లడించింది.